

# అమెరికా అమ్మాయి

- శ్రీనిధి యెల్లల



## త్రిశంకు స్వర్గం

స్ప్రింగ్ లో చిగుర్లు తొడిగి, మొగ్గలు వేసి ఎదిగిన మొక్కలన్నీ పూలు పూస్తున్నాయి. సమ్మర్ అంతా మంచి గాఢమైన రంగుల్లో పూచే పువ్వులను చూడడం నిజంగా ఒక వరం. అమెరికా వచ్చిన కొత్తల్లో ఇక్కడి చెట్టు చేమ, పురుగూ పుట్రాని అర్ధం చేసుకోడానికి కాస్త సమయం పట్టింది. ప్రతి చెట్టు దగ్గర ఆగి "మిమ్మల్ని ఎక్కడో చూసినట్టు ఉందండీ?" అనుకోడంతో సరిపోయేది. పూల మొక్కల్లో కూడా ఎన్ని కొత్త రకాలో, ఎన్ని రంగులో! స్ప్రింగ్ నుండి సమ్మర్ చివరి దాకా రెండు కళ్లతో నింపుకోలేనంత అందాలు.

మొత్తానికి ఒక ఋతు చక్రం తిరిగివచ్చేటప్పటికి మెల్లిగా ఇక్కడి మొక్కల గురించి తెలిసివచ్చింది. బోలెడంత సహాయ సహకారాలు అందించే లోకల్ నర్సరీల సాయంతో రెండు మొక్కలతో మొదలెట్టి బాల్కనీ లో ఒకటీ ఒకటీగా కుంపట్లలోనే చిన్న తోట ఒకటి ఏర్పరచుకున్నాను. రోజూ కాసేపు బాల్కనీ లో కూర్చుంటే అదొక హాయి. ఈసారి జిన్నియాలు, పిట్యూనియాలు, చంద్రకాంతలు, గడ్డి గులాబీలు, మార్నింగ్ గ్లోరీలు ఒకటే కన్నుల పండుగలా ఉంది. అప్పుడప్పుడు వీటిని చూడడానికి బుజ్జి బుజ్జి పిట్టలు, కందిరీగలు వస్తాయి. మొత్తానికి ఇంట్లోకి వెళ్లబుద్ధి కాదు ఈ సమయంలో. ఒక్కోసారి బాల్కనీ లోనే చిన్న గుడారం వేసుకుని ఉండిపోదాం అనిపిస్తుంది. ఎందుకూ అంటారా చెపుతా వినుకోండి..

కాలిఫోర్నియా రాష్ట్రంలో వాతావరణం ఇంచుమించుగా మన భారత దేశంలో లాగానే ఉంటుంది. అందులోనూ మా బే ఏరియా అందాలు, తీర ప్రాంతాల హొయలూ వగలు చూసి తీరాల్సిందే. ఇక్కడ మన వారి తాకిడి కూడా ఎక్కువే. బయటికి ఎక్కడికి వెళ్లినా బెంగుళూరులోనో హైదరాబాద్ లోనో ఉన్నట్టే ఉంటుంది. ఇహ ఇళ్ల విషయానికి వస్తే మాత్రం ఇంటి అద్దెలు బహు ప్రియం. చిన్ని చిన్ని అపార్ట్మెంట్లు స్టూడెంట్స్ తో, బాచిలర్స్ తో, కొత్త జంటలతో, కుటుంబాలతో అలరారుతూ ఉంటాయి. అలా మనుషులతో కిట కిట లాడుతూ ఉన్న ఒకానొక అపార్ట్మెంట్ సముదాయంలో ఒక చిన్ని భాగం మన సామ్రాజ్యం అనమాట. దాయాదుల ఆస్థి పంపకాల్లో ఉండేటన్ని లొసుగులతో నిండిన లీజ్ పేపర్స్ ప్రాపెర్టీ మానేజ్మెంట్ వారికిచ్చి సొంతం చేసుకున్న ఒక చిన్ని ముక్క.

చిన్నప్పుడు ఆడుకున్న బొమ్మలో బొమ్మ, బొమ్మ లో బొమ్మలో బొమ్మ వుండే 'బబుష్క' బొమ్మలాటలా వుంది నా సంసారం. ఎంత సర్దినా ఇంతే ఈ అపార్టుమెంట్లలో. ఇద్దరేసి మనుషులు ఉన్నంత వరకూ ముచ్చటగా బొమ్మరిల్లులాగే ఉండేది. రాను రాను పిల్లా పాపా చేరతారా? వారితో పాటు వారి పోషణ సామాగ్రి, ఎదుగుతూ ఉంటే బొమ్మలు చేరతాయా? ఇక మొదలవుతుంది సర్కస్సు. మనతో పాటు సమాంతరంగా ఇంకో బొమ్మల సంసారం నడుపుతారు ఈ పిలకాయలు. ఒక చెంప నేను ఏరుకుంటూ వస్తానా? ఇంకో చెంప ఇల్లంతా

పేర్చుకుంటూ వస్తుంది బుద్దది. వీటికి తోడు పిల్లల చిత్ర కళలు, హస్త కళలు ఒకటి. వాటన్నిటిని 'ఓహో! ఆహా!' అని పొగడాలి, 'కళా రత్న', 'పద్మశ్రీ' బిరుదుల్లాగా గోడల నిండా అతికించాలి. ఒకటని కాదులే!

గుడు గుడు గుంజం ఆడినట్టు అక్కడివి తీసి ఇక్కడా, ఇక్కడవి తీసి అక్కడ పెట్టనే సరిపోతోంది. ఒక వాకిలి లేదు పెరడు లేదు. ఊరు దాటినప్పటి నుండి అపార్ట్మెంట్ల పాలైపోయాను. ఈ మధ్య చెక్క కటకటాల గేటు దగ్గరి నుండి కనకాంబరాలు, నంది వర్ధనాలు, చామంతులు అటు ఇటు స్వాగతం పలుకుతుంటే, ఎండకి గొడుగు పట్టే వేప, మామిడి చెట్ల నీడలో చిన్ననాటి ఇంటి గుమ్మందాకా నడచే ఆ పది అడుగుల దారి ఎన్ని సార్లు గుర్తొస్తోందో! సొంత ఇంటి పిలుపు వచ్చే దాకా అటు ఇటు కాకుండా త్రిశంకు స్వర్గంలో లాగా ఊగుతూ ఉండడమే ఇక.

మనవేపు ఒక్కో ఊరికి ప్రత్యేకమైన కొన్ని గుర్తులు ఉంటాయి కదా వాటిని బట్టే అక్కడి మనుషుల జీవనాన్ని కూడా బేరీజు వేసేస్తూ ఉంటాము. ఉదాహరణకి కాకినాడ వాళ్లంటే ఎప్పుడూ చేతిలో కాజా పట్టుకు తిరుగుతూ ఉంటారు అని ఊహించేసుకునేదాన్ని. అంతెందుకు 'మాది తిరుపతి అండీ' అన్నామే అనుకోండి ఏకంగా ఆ వడ్డీ కాసులవాడు స్వయానా మా వేలు విడిచిన చుట్టం అనుకుని 'గోవిందా! గోవిందా!' అనే పెద్దవారిని చిన్నప్పుడు చాలా మందినే చూసాను.

చెప్పొచ్చేదేంటంటే అమెరికా వెళ్తున్నానంటే పడమటి సంధ్యారాగం లో విజయశాంతి లాగా ఈ బారు నుండి ఆ బారు దాకా పరుగులు పెట్టి చెంగనాలు వేసుకుంటూ తిరిగేటంత ఇళ్లు ఉంటాయనుకున్నాను. ఉంటాయి, నందనవనాల్లాంటి తోటలతో, దొడ్లతో దంతపు బొమ్మలంటి ఇళ్లు ఒకదాన్ని మించినవి ఒకటి ఎంత ముచ్చటగా ఉంటాయో అసలు. సింగిల్ ఫామిలీ హౌసెస్ వుండే నైబర్ హుడ్ లో అప్పుడప్పుడు అలా ఈ బొమ్మరిల్లులు చూసుకుంటూ తిరిగి వస్తూ ఉంటా. భవిష్యత్తు మీద ఒక ఆశ పుడుతుంది. కాకపోతే అమెరికాలో అడుగు పెట్టిన వెంటనే సొంత ఇంటికి రావాలంటే ఆషామాషీ కాదు. ముందుగా కొన్నాళ్ల వరకూ అపార్ట్మెంట్వాసం తప్పదు చాలా మందికి.

రకరకాల మనుషులు రకరకాల అనుభవాలు ఇక్కడ. చెప్పులో రాయిలాంటి నూటా తొంబై పీత కష్టాలు. మీరు ఉండేది చివరి అంతస్తు అయితే తప్ప ప్రతి వారికీ వెర్రెక్కించే ఒక కుటుంబం నెత్తి మీద ఉండటం ఖాయం. అట్లా మా నెత్తి మీద ఇద్దరు మగ పిల్లలు గల పంజాబీ కుటుంబం. వేళా పాలా లేకుండా ఎగిరి దూకుతూనే ఉంటారేమో చెక్క పైకప్పు ఎప్పుడో కూలి నిద్దరబోతున్న మా పక్కలో పడతారేమో ఈ కోతులు అనుకుంటూ ఉంటా. ఎన్ని సార్లు చెప్పినా ప్రయోజనం లేదు. ఎప్పుడు పలకరించినా ఆ పిల్లలతో వేగలేక అప్పుడే నైట్ షిఫ్ట్ ముగించుకుని వచ్చిన నర్సులా ఉండే ఆవిడని గట్టిగా ఏమి అనలేక ఈ అకాల తల మర్దనలకి అలవాటైపోయాము. ఈ మధ్య మాములుగా అప్పుడప్పుడపు వచ్చే భూకంపాలు కూడా పోల్చుకోలేక పోతున్నాం వీరి ధన ధన మోతలతో.

ఇహ మా ఎదురింట్లో చైనా వారుంటారు. వాళ్ళకి నా అంత వుండే జర్మన్ షెపర్డ్ వుంది. దీన్ని వాకింగ్ తీస్కెళ్ళేటప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు చూడాలి. నలుగురు జవాన్లు హాల్ వే లో మార్చ్ ఫాస్ట్ చేసినట్టే ఉంటుంది. ఒకసారి అటు ఇటు ఒకేసారి తలుపులు తెరిచేపాటికి ఏనుగంత కుక్క మీదికి వచ్చేసరికి గుండాగిపోయినంత పనైంది నాకు. "హి హి ! ఐ థింక్ హి లైక్స్ యు" అని కుక్క గలాయన పళ్ళికిలిస్తే చేసేదేం లేక ధైర్యం కూడ కట్టుకుని నేను తిరిగి ఓ వెర్రి నవ్వు నవ్వి దేవుడా!రామా! అని పారిపోయా. అప్పటి నుండి నా ఇంటి నుండి నేను బయటికి వెళ్లాలన్నా దొంగలాగా పీప్ హోల్ నుండి చూసి తలుపు తెరచి మరీ వెళ్తున్నా. పాపం దాన్ని కూడా ఇంట్లో వదిలేసి ఆఫీసులకి వెళ్ళిపోతారు. నేను ఏదైనా పని మీద బయటికి వచ్చినప్పుడల్లా కాచుకుని ఉంటుందేమో అలికిడి విని కాళ్ళతో తలుపులు బరుకుతూ ఉంటుంది పిచ్చిది. "ఊఉ ! సరేలే ! ఓర్చుకోవాలి మరి తప్పదు ." అని ఊరడిస్తా ఉంటా, తలుపులు వేసి ఉన్నాయన్న ధైర్యంతో. కుయ్ కుయ్ మని ప్రతిస్పందిస్తుంది. ఈ అపార్టుమెంట్లలో మనుషులని అట్టిపెట్టడయ్యడమే నేరం అంటే పాపం ఈ మూగ జీవాలని ఒంటరిగా నాలుగు గోడల మధ్య పెట్టెయ్యడం అంత పాపం ఇంకోటి ఉండదనిపిస్తుంది.

ఇహ కమ్యూనిటీ లాండ్రీ గోల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎప్పుడూ అయితే అన్ని వాషర్లు నిండిపోయి ఉంటాయి లేదా సగం డ్రైయ్యర్లు రిపైర్ లో ఉంటాయి. ఎన్ని సార్లు క్వార్టర్ డాలర్లు మింగేసి సగంలో పని ఆపేసి చిత్ర వధ పెట్టిన సందర్భాలు ఉన్నాయో చెప్పలేను. అలారం పెట్టుకుని మరి వాషర్ లోంచి డ్రైయర్ కి డ్రైయర్ నుంచి ఇంటికి తెచ్చుకోవాలి బట్టలు. కర్మ కాలి ఏమరచి కాస్త లేటుగా వెళ్ళామో ఆరిన బట్టలన్నీ డ్రైయర్ లోంచి తీసి బయట పడేస్తారు. ఎవరి అవసరం వారిది మరి. లాండ్రీ రూమ్ చుట్టూ ప్రదక్షిణలు చేసే ప్రతి సారి ఈసారి ఇల్లు మారితే ఇంట్లోనే బిల్ట్ ఇన్ 'వాషెర్/డ్రైయర్ ' ఉన్న దాంట్లోకే వెళ్లాలని శపథం చేసేసుకుంటూ ఉంటాను.

దీనికి తోడు నక్షత్రకుడిలా మాకొ ప్రాపర్టీ మేనేజరు. నేను టంచనుగా టయానికి వాషర్ నుండి డ్రైయర్ నుండి బట్టలు తీస్కున్నపు ఎప్పుడు రాడు కానీ పనిలో పడి కాస్త ఏమారి ఐదు నిముషాలు ఆలస్యం అయితే చాలు పట్టేసుకుంటాడు. మిగతా వారికి తీవ్ర ఇబ్బంది అని వెనుక వెయిటింగ్ లో ఎవరు లేకపోయినా క్లాస్ తీసుకుంటాడు. అసలే రిటైర్డ్ పెద్దాయన.  రాత్రి తొమ్మిదంటే ఖచ్చితంగా తొమ్మిదికి లాండ్రీ రూమ్ మూసేస్తాడు. డ్రైయర్ లో మర్చిపోతే పరవాలేదండి ..పొరపాటున వాషెర్ లో పెట్టి మరిచామా ఇక అంతే సంగతులు. లోక కళ్యాణం మొత్తం ఈ ప్రాపెర్టీ మానేజ్మెంట్ మీదే ఆధారపడి నడుస్తున్నంత ఇదిగా పని చేస్తుంటాడు. అసలు ప్రాపర్టీ మేనేజర్ల కింద రిటైర్డ్ వాళ్ళని పెట్టడం అంత భారీ కుంభకోణం ప్రపంచంలో వేరే ఏదీ లేదంటే నమ్మి తీరాలి.

నా అదృష్టానికి మా బిల్డింగ్ కి "ట్రాష్ చూట్" సిస్టం. ప్రతి అంతస్థుకి ఓక మూల ఒక తలుపు ఆ తలుపు తెరిస్తే ఒక చిన్న కిటికీ అది తీసి అందులో మన చెత్త వేసేస్తే చక్కగా గొట్టామ్ గుండా వెళ్లి కింద ఉన్న పేద్ద చెత్త బుట్టలో పడిపోతుంది. రోజూ ఉదయాన్నే నిద్ర లేపేసి చంటి పిల్లల్ని దడిపించేలా, కాస్త పెద్ద పిల్లల్ని అబ్బుర పరచేలా వచ్చే 'ట్రాష్ వాన్' అమాంతం ఆ పెద్ద చెత్త బుట్టని ఎత్తి పొట్టలో వేసేస్కుని వెళ్ళిపోతుంది . ఎంత లేసి సదుపాయాలు కనుక్కున్నారు కదా మనకోసం అని ఆశ్చర్య పోతూ ఉంటాను. కానీ ఏ పనైనా తిన్నగా జరగనిస్తే మనం మనుషులం ఎట్లా అవుతాము? అస్సలు ఒక్కో అపార్ట్మెంట్ కాంప్లెక్స్ లో ఒక్క రోజులో పోగు పడే చెత్త చూస్తే పర్యావరణ ప్రేమికులకి ఎవరికైనా గుండె పోటు రావలసిందే.

మా మేనేజరు నియంత అప్పటికి కాలికి బలపం కట్టుకుని ప్రతి ఫ్లోర్ లో ట్రాష్ చూట్ దగ్గర నోటీసు అంటిచే ఉంచుతాడు 'ఇచట ఇంటి చెత్త తప్పించి కార్డు బోర్డులు పెద్ద పెద్ద సామాను వేయరాదు.  పెద్ద సామానుని కిందికి వెళ్లి గార్బేజ్ రూమ్ లో పెట్టేసి రండి' అని. ఆబ్బె. 'ఇచట ఓ పని చేయరాదు' అన్నప్పుడే అక్కడ ఆ పని మాత్రమే చేయాలి అనే దురద ప్రపంచం మొత్తం మీద ఉన్నట్టు ఉంది. నెలకి రెండు మూడు సార్లైనా ఏదో వెయ్యకూడని వస్తువు ఆ చెత్త గొట్టంలో వేసి ఇరికించేస్తారు. ఇహ మళ్లీ అది క్లియర్ చేసేదాకా ట్రాష్ కార్ట్ దగ్గరికి ఎక్కి దిగే పనే. దిండ్లు, దుప్పట్లు, పిజ్జా బాక్సులు, రోజుకి ఒక అరడజనైనా ఆన్లైన్ లో వచ్చే అట్ట  పెట్టెలు సర్వం సమస్తం అందులోనే. ఒకసారైతే ఏకంగా చిన్న పరుపుని, కంఫోర్టర్ ని చుట్ట చుట్టి తోసేశారు. ఆ రోజు క్లీనింగ్ వాళ్ల అవస్థ చూడాలి. ద్రౌపది చీరలాగా వస్తూనే ఉంది చెత్త గొట్టం లోంచి. పక్క వారి గురించి అస్సలు పట్టింపు లేని వారు ప్రపంచం మొత్తం ఉన్నారు అనిపించింది.

కొన్ని రోజులు మా కౌంటీ వాళ్లు అపార్టుమెంట్లలో చెత్త అన్నిటికన్నా ఎక్కువ అని, అందులోనూ వంటింటి చెత్త ఇక్కడైతే ఎక్కువ వస్తుంది అని ఫ్రీ గా ఆర్గానిక్ చెత్త వేసుకోడానికి బుజ్జి చెత్త బుట్టలు పంపిణి చేసి ఇదంతా పోగు చెయ్యడానికి కింద పెద్ద పెద్ద పచ్చని గార్బేజ్ క్యాన్లు ఏర్పాటు చేసారు. మేము చేయాల్సిందల్లా వంటింటి చెత్తని కింది దాకా తీస్కుని వెళ్లి ప్రత్యేకమైన క్యాన్లలో వెయ్యడమే. మా వాళ్లకి మాత్రం ఇది రాకెట్ సైన్స్ అంత కష్టం అయిపోయింది. చివరికి ఆ బుట్టలో కూడా ప్లాస్టిక్ సంచులూ, క్యాన్లు, అట్టపెట్టెలు నింపడం మొదలు పెట్టేసారు. తెలిసి చేస్తారో తెలియక చేస్తారో అర్థం కాదు అస్సలు.

ఇల్లిల్లు తిరిగి చెప్పినా, మీటింగ్ పెట్టి అరిచి మొత్తుకున్నా, అడుగడుగునా బోర్డ్లు పెట్టినా పెద్దాయన సాధించలేనిది ఏదైనా ఉందంటే అది ఈ 'వేస్ట్ మానేజ్మెంటే.' పాపం మా మేనేజరు కష్టం చూస్తే బాధేసేది. నేను కూడా  ఆయనతో కలిసి వాలంటీర్ గా చేశాను

కొన్నాళ్ళు. అక్కడే నిల్చుని చూస్తున్నా కళ్ళ ముందే ఇష్టం వచ్చినట్టు చెత్తని కుక్కేస్తుంటే విసిగి పోయి నిద్ర పోతున్నట్టు నటించే వారిని లేపడం అసాధ్యం అని వదిలేసాను.

ఇలా ప్లే డేట్స్ అని చెప్పి పిల్లలతో సహా వచ్చి టైం తినేసే తల్లులు, గెట్ టు గెతర్లలో మాయమయ్యే వారాంతాలు, కామన్ పార్కింగ్ కోసం తిప్పలు, గోడలని తలుపులని పిల్లల నుండి రక్షిండానికి పడే పాట్లు, కాసింత స్థలంలోనే కొత్తదనం తీసుకుని రావడానికి పడే అగచాట్లు వెరసి సగటు అమెరికా అపార్ట్మెంట్ జీవనం ఇది.

ఇల్లంతా కదిలి మీద పడిపోతోందేమో అనేంత సామానుతో, ఎంత సర్దినా గజిబిజి గందరగోళంలా ఉండే ఇంట్లో విశ్రాంతిగా ఉండే సమయం ఈ బాల్కనీ లోని ఏకాంతాలు. అందుకే ఇక్కడే ఉండిపోవాలి అనిపిస్తుంది. ఇంట్లోకి వెళ్లబుద్ధే కాదు. అది కూడా చలికాలం వచ్చేదాకే . అప్పుడు ఇంకో సర్కస్ మొదలు ఇక.

జీవితంలోని ఎన్నో మొదటి జ్ఞాపకాలు ముడివేసుకున్న చోటు కూడా ఇదే. జంటగా కలిసి కన్న మొదటి కలలు, మొదటి కారు, మొదటి సంతానం, పిల్లల బాల్యం ఇలా ఎన్నో జ్ఞాపకాలు ముడేసుకుంటున్నది కూడా ఈ త్రిశంకు స్వర్గం లోనే. అమెరికా జీవనంలో ఇదొక మజిలీ అంతే. రేపెప్పుడైనా ఇంతలా ఎదురుచూస్తున్నా తీరుబడి, ప్రశాంతత దొరికినా అప్పుడు ఈ హడావిడి తప్పిపోయిందని బెంగపడతానేమో! ఏమో ఉన్నదానిపై కన్నా లేనిదాని మీదే మోజు ఎక్కువ కదా మనకి! చెప్పలేమ్. చూద్దాం!

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments